క్లుప్తంగా

సురవరంను కలిసిన సర్పంచు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డిని సోమవారం సర్పంచు రేఖ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు మండల అభివృద్ధిపై చర్చించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవన్న, ఆదర్శ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



కేటీదొడ్డి: పారదర్శకంగా తుది జాబితా రూపొందిస్తామని డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు సవరణ, ఫొటో, మిస్సింగ్, డబుల్ ఓటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, అంగన్‌వాడీ టీచర్ ఆసియా బేగం, వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీలకు నీరు వదలాలి

గద్వాల రూరల్: యాసంగిలో పంటలకు నీరు అందక ఎండుతున్నాయని సోమవారం జిల్లా కేంద్రంలోని జూరాల ఎస్ఈ కార్యాలయంలో సిబ్బందికి రైతులు వినతిపత్రం అందజేశారు. జూరాల కుడి ప్రధాన కాలువ పరిధిలో డిస్ట్రిబ్యూటర్లు 34, 37 కింద 500 ఎకరాలలో ఆరుతడి పంటలు సాగుచేశామని వివరించారు. రోజు కాకపోయిన వారబంధి విధానంలో నీటిని విడుదల చేయాలని ఆయకట్టుదారులు కోరారు. కార్యక్రమంలో పుటాన్‌దొడ్డి మహేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు



మానవపాడు: ఆర్‌టీసీ బస్టాండ్‌కు హద్దులు ఏర్పాటు చేశామని ఆర్‌టీసీ డీఎం శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌కు రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆర్‌టీసీ డీఎం శ్రీనివాసన్ కొలతలు నిర్వహించారు. చుట్టూ కొలతలు నిర్వహించి హద్దులు గుర్తించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, సర్వేయర్ వెంకటలక్ష్మి, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

బస్సు కోసం నిరీక్షణ



అలంపూర్ రూరల్: మండలంలోని భైరంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు సోమవారం బస్సు కోసం గంటల పాటు నిరీక్షించారు. ఆర్‌టీసీ బస్సు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి బస్టాండ్‌లోనే పడిగాపులు దుస్థితి ఏర్పడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సు ఎప్పుడు వస్తుందో తెలవడం లేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌టీసీ అధికారులు స్పందించి సమయానికి బస్సు నడిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: అకారణంగా దాడి చేసిన సంఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి మోమిన్‌మహల్ల కాలనీకి చెందిన హుజీర్, మాలిక్‌ల మధ్య మాటమాట పెరిగింది. ఈ క్రమంలో మాలిక్‌పై హుజీర్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో బాధితుడు మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీకి చెందిన పద్మ అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుంది. ఎస్ఐ అబ్దుల్ షకుర్ వివరాల ప్రకారం ఆదివారం వివిధ పనుల నిమిత్తం పద్మ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలవలేదు. దీంతో ఆమె కుమారుడు రాఘవేంద్ర సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేతాజీ జీవితం ఆదర్శం

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



అయిజ మండలంలోని ఉత్తనూరులో..



గద్వాలలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా వ్యాప్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.జె సంపత్‌కుమార్ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా భారతీయులకు స్వాతంత్ర్యాన్ని సాధించారని గుర్తు చేశారు. నేతాజీ జీవితం ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల నుంచి 600 మీటర్ల తిరంగా జెండాతో ప్రదర్శనగా పాతబస్టాండు, రాజీవ్‌మార్గ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ సతీష్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య తన ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన ధీరుడు నేతాజీ అని కొనియాడారు. అంతకు ముందు సుభాష్ చంద్రబోస్ వేషధారణలతో చిన్నారులు అలరించాయి. అనంతరం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్వేత, అశోక్, రఘువంశీ, నగర కార్యదర్శి గణేష్, జిల్లా కన్వీనర్ సురేష్, అనిల్, నవీన్, ఉమా, ఆయా పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్ రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం సాధన కోసం అలుపెరగని కృషి చేసిన ఘనత నేతాజీకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకట్రాములు, శ్రీనివాసులు, చిత్తారి కిరణ్, గీతారెడ్డి, చందు, సత్యం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని ఉత్తనూరులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సర్వేశ్వరాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతినగర్: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి, నాయకులు అశోక్, వెంకటేష్, అయ్యరాజ్‌లు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేతాజీ జయంతిని జరుపుకొన్నారు. సర్పంచు ధనలక్ష్మి, రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్ప, గట్టు–2 ఎంపీటీసీ కృష్ణ, కార్యదర్శి జగన్నాథంలు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, వార్డు సభ్యులు రమేష్, మహబూబ్‌పాషా, ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కేఎస్‌డీ రాజు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. పాఠశాలలో నేతాజీ విగ్రహానికి సర్పంచు రేఖ, వైస్ ఎంపీపీ దేవన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, భరత్ కుమార్, అరుణ ప్రభావతి, ప్రసన్న, భూలోకేశ్వరి, వెంకటేశ్వర్లు, బీచుపల్లి, మద్దిలేటి, హస్సదునిస్సాబేగం, ఆదర్శ విద్యార్థి సంఘం సభ్యులు వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.



గట్టులో నివాళులర్పిస్తున్న నాయకులు



శాంతినగర్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు



ఉండవెల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



శాంతినగర్‌లో విద్యార్థినులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ నరసింహులు



మానవపాడులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, ఎస్ఐ

శాంతినగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ నరసింహులు అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంపీడీఓ రమణరావు, ఎస్ఐ సంతోష్‌లు క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు'



అలంపూర్‌లోని క్యాతూర్ పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కేటీదొడ్డి మండలంలోని నందిన్నెలో..

అలంపూర్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం మూడోరోజు సోమవారం కొనసాగింది. అలంపూర్‌లో మొత్తం 152 మంది, క్యాతూర్ పీహెచ్‌సీలో మొత్తం 155 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అలంపూర్‌లో 36 మందికి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. 76 మందికి కళ్ల అద్దాలను అందజేశారు. ఇంకా 33 మందికి ఆన్‌లైన్‌లో కంటి అద్దాల కోసం పొందుపరిచారు. క్యాతూర్ పీహెచ్‌సీలో 08 ఆపరేషన్ల నిమిత్తం రిఫర్ చేశారు. 74 మందికి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూణరాణి, డాక్టర్ హేమమానస, డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చండూరులో మూడో రోజు కంటి వెలుగును సర్పంచ్ నరసింహులు ప్రారంభించారు. శిబిరంలో 145 మంది కంటి పరీక్షలు చేసుకోగా, 31 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆపరేషన్ నిమిత్తం 29 మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ యాకుబ్‌బాషా, పరుశరాముడు, చంద్రన్న, ప్రసన్నకుమారి, నసీమాభేగం, రాణి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విని, డాక్టర్ నర్సింహారావు, సూపర్‌వైజర్ బాలమ్మ, ఎఎన్ఎం సురేఖ, నర్మద, రుకియా, కృష్ణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంతోపాటు, చిన్నోనిపల్లె గ్రామాల్లో మొత్తం 240 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. మొత్తం 64 మందికి రీడింగ్ గ్లాసులు, మరో 82 మంది కంటి అద్దాల కోసం ఆర్డర్ ఇచ్చారు. మంగళవారం తుమ్మలపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేత



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలించాలని సోమవారం పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌కు గ్రామానికి చెందిన యువకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అనువైన స్థలం పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సక్రియా నాయక్

ఎర్రవల్లిచౌరస్తా: ఎరువులను కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పకుండా ఒరిజినల్ రసీదులు ఇవ్వాలని ఏడీఏ సక్రియా నాయక్ సూచించారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం రైతు వేదికలో ఎరువుల డీలర్లకు ఆన్‌లైన్ ఫర్టిలైజర్స్ వ్యవస్థ నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో రసాయనిక ఎరువుల లైసెన్స్ పొందుపరిచే విధానం, ఓఫామ్ నమోదు, డోర్ నెంబర్, వ్యాపారానికి సంబంధించిన పలు అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు పొందిన ఎరువులనే రైతులకు విక్రయించాలన్నారు. ప్రతి షాపులో అనుమతి పత్రాలను డిస్‌ప్లే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ అయూబ్, ఏఈఓ మౌనిక, డీలర్లు, తదితరులు ఉన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

గద్వాల అర్బన్: మతోన్మాదానికి వ్యతిరేకంగా భావ ప్రకటన స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వెంకటస్వామి, ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో మనువాదుల నాటకాలు సాగనివ్వబోమన్నారు. ఉపాధ్యాయులు, ప్రజాస్వామిక వాదులు, అంబేద్కరిస్టులు, నాస్తికులపై మతోన్మాద వాదుల దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణంలో నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాషా, చైతన్య మహిళ సంఘం రేవతి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వంశీకుమార్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య, ఐద్వా సంఘం నర్మద, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల వెన్నంటి ఉంటా'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి

మానవపాడు: ఉపాధ్యాయులకు అండగా ఉంటానని తపస్ ఉపాధ్యాయుల సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడతానన్నారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీంధర్‌రెడ్డి, నరేష్, మురళీధర్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ప్రాణి దైవంతో సమానం



ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఉండవెల్లి: ప్రతి ప్రాణి దైవంతో సమానమని భగవాన్ చంద్ర సుజ్జి అన్నారు. సోమవారం మండలంలోని పుల్లూరు గ్రామ శివారులోని మహావీర్ ఆలయంలో ఏర్పాటు చేసిన మహావీర్ జన్మ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భగవాన్ చంద్ర సుజ్జి ఆధ్యాత్మిక సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, స్వామి వారి ఆశీర్వాదం పొందారు.

హర హర మహాదేవ



ఉండవెల్లిలో అభిషేకం చేస్తున్న స్వాములు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో మాఘమాసం మొదటి సోమవారం పర్వదినం సందర్భంగా పురోహితుడు శ్రీధర్‌శర్మ దంపతుల ఆధ్వర్యంలో పుట్టమట్టితో తయారుచేసిన శివలింగానికి సహస్త్ర బిల్వార్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన శివస్వాములు హాజరై మహాశివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు చేశారు. శివస్వాములు ఆలపించిన ఓం నమఃశివాయ, హరహర మహదేవ అంటూ చేసిన నినాదాలతో గ్రామంలో శివపంచాక్షరి మంత్రం మార్మోగింది. అనంతరం శివమాలధారులకు అల్పాహారం, పాలుపండ్లు అందజేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివమాలధారులు శివలింగానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సోమవారం భస్మాభిషేకం నిర్వహించి, పంచామృతాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ గురుస్వాములు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతిపై నిర్లక్ష్యం తగదు



సమస్యలు తెలుసుకుంటున్న రంజిత్ కుమార్

ధరూరు: పల్లెల ప్రగతిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లళ్ల రంజిత్ కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని ద్యాగదొడ్డిలో పల్లె నిద్ర చేశారు. సోమవారం ఉదయం గ్రామంలోని కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామంలో మురుగు కాల్వలు అధ్వాన్నంగా ఉన్నాయని, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లవన్న, మండల అధ్యక్షుడు గోవిందు, నాయకులు రాము, హనుమంతు, ఎల్లప్ప, మహానంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: రోడ్డుపై కిందపడిన వ్యక్తిని ఎమ్మెల్యే సేవలందించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తా సమీపంలో కర్నూల్ జిల్లా దేవమాడ గ్రామానికి చెందిన రామచంద్రుడు బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అదే మార్గంలో వెళ్తున్న ఎమ్మెల్యే అబ్రహం అతడిని గమనించి వాహనాన్ని నిలిపాడు. రోడ్డు పక్కన గాయాలతో కిందపడి ఇబ్బంది పడుతున్న రామచంద్రుడిని లేపి వివరాలు తెలుసుకొని అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించాడు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన



డైనింగ్ హాల్ పనులను పరిశీలిస్తున్న గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్

గట్టు: మను ఊరు–మన బడి పథకం ద్వారా చాగదోనలో జరుగుతున్న పనులను సోమవారం గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్‌లు పరిశీలించారు. చాగదోన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న డైనింగ్ హాలు పనులను నాణ్యతగా చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని హెచ్ఎం, విద్యార్థులు చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణగౌడ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

గట్టు: కేంద్రం ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆలూరులో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాజప్ప ఆధ్వర్యంలో బూత్ స్థాయి కమిటీ, మండల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఇది తిప్పికోట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలలో వైకుంఠధామాలు, రైతు వేదికలు, సీసీ రోడ్లు, హరిత హారం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏటా రూ.6 వేలను జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, నాయకులు తిమ్మప్ప, కత్రెప్ప, గోవిందు, వెంకట్రాములు, నర్సింహులు, బూత్‌స్థాయి కమిటీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.